సాక్షి చిత్తూరు
శనివారం । 2 । ఆగస్టు । 2025



డీఐసీ ఆశయానికి తూట్లు

డీఐసీ ఆశయానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. బాధితుల కోసం ఏర్పాటు చేసిన వాహనాన్ని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. - 8లో



ఘోర రోడ్డు ప్రమాదం

కుప్పం పట్టణంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్కూటరిస్ట్ అక్కడికక్కడే మృతిచెందాడు - 8లో



అది సరికాదు

కూటమి ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్లను ఎంఈఓలుగా నియమించడం సరికాదని పీఆర్టీయూ నాయకులు ధ్వజమెత్తారు. - 8లో

న్యూస్‌రీల్

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ రవికుమార్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని డ్వామా పీడీ రవికుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 2029 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,61,185 మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు చెప్పారు. ఈ ఏడాది 76,410 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వయోజన విద్య డీడీ మహమ్మద్ ఆజాద్, డీఆర్‌డీఏ ఏపీఎం మంజుల, డీఈవో కార్యాలయం ఏడీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో స్పాట్ అడ్మిషన్లు



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకుల పాఠశాలల్లో మిగిలి ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జిల్లా కో–ఆర్డినేటర్ పద్మజ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో రామకుప్పం, చిత్తూరు, పలమనేరు, కుప్పం, జీడీ నెల్లూరు, పూతలపట్టు, విజిలాపురంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలలున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలల్లో 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఐదో తరగతి, పది, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

డీఐఈవోగా రఘుపతి



రఘుపతి, నూతన డీఐఈవో

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ఇంటర్మీడియెట్ శాఖ నూతన డీఐఈవోగా రఘుపతి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు తిరుపతి జిల్లా వరదయ్యపాళ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న రఘుపతి ని చిత్తూరు డీఐఈవోగా నియమించారు. కాగా నేడు ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.



అన్నదాతకు.. గుండెకోత!

'అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు అండగా నిలుస్తాం. అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి నిధిని అందిస్తాం. ఏడాదికి రూ.20 వేల చొప్పున బ్యాంక్ ఖాతాలో జమ చేస్తాం. ఎలాంటి వివక్ష లేకుండా అందర్నీ ఆదుకుంటాం. పార్టీలకతీతంగా పథకాలు అందిస్తాం'.. అంటూ ఎన్నికల ముందు కూటమి నేతలు ప్రసంగాలు దంచేశారు. ఊరూవాడా ఢంకా భజాయించారు. తీరా అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయడానికి సిద్ధమయ్యారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా 231,144 మంది రైతులుండగా వివిధ కారణాలతో 25,391 మందిని అనర్హులుగా ప్రకటించారు. దీనిపై పలువురు అన్నదాతలు మండిపడుతున్నారు.

అన్నదాత సుఖీభవకు 25,391 వేల మంది దూరం

- వివిధ కారణాలతో అనర్హులుగా ప్రకటించిన కూటమి ప్రభుత్వం
- 2,05,753 మంది రైతులు ఎంపిక
- నేడు రైతు ఖాతాల్లోకి నిధులు జమ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అన్నదాత ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. వివిధ కారణాలతో అన్నదాత సుఖీభవ పథకానికి చాలా మందిని దూరం చేసింది. ఈ పథకం కింద ఏడాదికి రూ.20వేలు ఇస్తామంటూ టీడీపీ అధినేతగా చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక తొలి ఏడాదిలోనే హామీని తుంగలో తొక్కేశారు. తాజాగా పీఎం కిసాన్ మొత్తాన్ని మినహాయించి రూ.14వేలు మూడు విడతల్లో అందజేస్తామని ఆయన ఇటీవల సెలవివ్వడం గమనార్హం.

2,05,753 మంది అర్హులు

జిల్లాలో మూడు లక్షల హెక్టార్ల మేర వ్యవసాయ భూమి ఉంది. ఇందులో 2.5 హెక్టార్ల దాకా వివిధ రకాల పంటలు సాగుచేస్తుంటారు. దీనిపై మూడు లక్షల మంది దాకా రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. ఇందులో 70 శాతం మంది పేద రైతులే. ప్రస్తుతం అన్నదాత సుఖీభవ పథకానికి జిల్లా వ్యాప్తంగా 2,05,753 మందిని గుర్తించారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.102.88 కోట్లు, పీఎం కిసాన్‌లో 1.76 లక్ష మందికి గాను రూ.35.2 కోట్లు కేటాయించనున్నారు. ఈ నిధులు శనివారం నుంచి అన్నదాత ఖాతాల్లో జమకానున్నాయి.

మోసపూరితమైన మాటలు

2014 ఎన్నికల్లో రైతులకు సంపూర్ణ రుణ మాఫీ చేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు జబ్బలు చరిచారు. అధికారంలోకి వచ్చాక రైతులందరికీ పంగనామాలు పెట్టారు. రుణం మొత్తాన్ని ఐదు విడతల్లో ఇస్తామని ఒకటి, రెండు విడతలు ఇచ్చి మిగతావి ఎగనామం పెట్టారు.

25,391 వేల మంది దూరం



అన్నదాతలు (ఫైల్)

ఈకేవైసీ, ఆధార్, బ్యాంకు అకౌంట్ లింకు కాలేదని..ఇతరత్రా కారణాలతో జిల్లా వ్యాప్తంగా 25,391 వేల మంది రైతులను అనర్హులుగా ప్రకటించారు. ఆర్టీజీఎస్ వ్యాలిడేషన్ తర్వాత అర్హులైన రైతులు 2,05,753 మందేనని జిల్లా వ్యవసాయ అధికారులు లెక్కలు గట్టారు. పలువురు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వేలిముద్ర వేయాల్సి ఉంది. ఓటీపీ చెప్పాల్సి ఉంటుంది. వీటిపై అవగాహన లేక వేలాది మంది రైతులు వేలిముద్ర వేయలేదు. వారికి అవగాహన కల్పించడంలో సర్కారు పూర్తిగా విఫలమైంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా ఇలా..

సంవత్సరం	రైతుల సంఖ్య	రూ.కోట్లల్లో
2019–20	220256	165.19
2020–21	231038	173.52
2021–22	216594	162.45
2022–23	223165	211.12
2023–24	231144	174.03

అందరికీ అందాలి



అర్హత కలిగిన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలి. ఈకేవైసీ చేయలేదని, ఇతర సాంకేతిక కారణాలు చూపుతూ కూటమి ప్రభుత్వం రైతులకు పథకం అందకుండా అన్యాయం చేయాలని చూస్తోంది. అలా కాకుండా అర్హులైన ప్రతి రైతుకూ పథకాన్ని వర్తింప చేయాలి. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అవస్థలు పడుతున్నారు. సాగుకు పెట్టిన పెట్టుబడులు సైతం అందక ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ పథకంలో కోతలు లేకుండా అందించాలి. – **పాలాక్షిరెడ్డి, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు, బంగారుపాళ్యం**

ప్రభుత్వ మార్గదర్శకాలతోనే ఆటోమ్యుటేషన్



మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి

చిత్తూరు : ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆటో మ్యుటేషన్ విధానం పెట్టారని జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి తెలిపారు. శుక్రవారం నుంచి ప్రారంభించిన ఆటో మ్యుటేషన్ విధానంపై శుక్రవారం చిత్తూరు అర్బన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కమిషనర్ నరసింహప్రసాద్, సహాయ కమిషనర్ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీ స్థలం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఆటో మ్యుటేషన్‌ను పూర్తిచేయాలని మున్సిపల్ రెవెన్యూ అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. నూతన విధానంపై అధికారులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఆర్వో గోపాలకృష్ణవర్మ, సబ్ రిజిస్ట్రార్ హేమంత్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

నూతన విధానంతో మొదలైన రిజిస్ట్రేషన్స్ సంఖ్య మొదటి రోజు పలు కారణాలతో తగ్గాయి. నెట్‌వర్క్ సరిగ్గా పనిచేయకపోవడం, డ్యాకుమెంటేషన్ సమయంలో ఎర్రర్ రావడం, పన్నులు అప్‌డేట్ సక్రమంగా చూపకపోవడం వంటి సమస్యలు వచ్చినట్లు తెలుస్తోంది. గురువారం 40 వరకు రిజిస్ట్రేషన్స్ జరగ్గ, శుక్రవారం 20 రిజిస్ట్రేషన్స్ మాత్రమే జరిగాయి.

ఆగస్టు 15 తర్వాత పరీక్షలు నిర్వహించండి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 15 తర్వాత పరీక్షలు నిర్వహించాలని వైఎస్సార్ టీఏ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించనున్న ఎఫ్‌ఏ–1 పరీక్షలు ఈ నెల 15 తర్వాత నిర్వహించాలన్నారు. ఈ నెల 1వ తేదీన నిర్వహించిన గూగుల్ మీట్‌లో ఈ నెల 4వ తేదీ నుంచి జరగాల్సిన పరీక్షలను ఈ నెల 11 నుంచి 14 వ తేదీ వరకు నిర్వహించాలని ఆదేశించారన్నారు.

అబార్షన్ కేసులకు కారణాలు తెలపండి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో జరిగిన అబార్షన్ కేసులకు గల కారణాలను లిఖితపూర్వకంగా తెలపాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. వైద్య శాఖ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ అబార్షన్ కేసులన్నింటినీ పరిశీలించాలన్నారు. అందుకు గల కారణాలను నివేదికల రూపంలో తెలియజేయాలని ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఎక్కువ శాతం కాన్పులు జరగాలన్నారు. శస్త్ర చికిత్సలు ఎక్కువగా జరగకుండా చూడాల్సిన బాధ్యత డాక్టర్లపై ఉందన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో నెలకు 50 సుఖ ప్రసవాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో పీసీ పీఎన్‌డీటీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమీక్షలో డీఎంఅండ్‌హెచ్‌వో సుధారాణి, డీసీహెచ్‌ఎస్ పద్మాంజలి తదితరులు పాల్గొన్నారు.

వాటిని ఎందుకు తనిఖీ చేయడం లేదు?

జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో ఎంపీడీవోలు ఎందుకు తనిఖీ చేయడం లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌసింగ్ శాఖ సమీక్షలో ఆయన మాట్లాడారు. హౌసింగ్ కాలనీల్లో అన్ని మౌలిక వసతులు మెరుపరచాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ పథకానికి జిల్లాలో 2.05 లక్షల మంది అర్హులున్నట్లు తేలిందన్నారు. వీరి ఖాతాల్లో రూ.138 కోట్లను ప్రభుత్వం జమచేయనున్నట్లు వెల్లడించారు. డ్వామా శాఖ సమీక్షలో మాట్లాడుతూ జిల్లాలో నిర్మిస్తున్న గోకులం షెడ్ల బిల్లుల మంజూరులో జాప్యం చేయకూడదని ఆదేశించారు. జిల్లాలో 2,795 మినీ గోకులం షెడ్లు నిర్మించడమే లక్ష్యమని తెలిపారు. ఒక్కొక్క షెడ్ నిర్మాణానికి రూ.2.30 లక్షలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఇందుకు జిల్లాలో చేపట్టే పనులకు రూ.62.93 కోట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఈ సమీక్షలో డ్వామా శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా అర్హత, ఆసక్తి ఉన్న ప్రభుత్వ టీచర్లు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో వరలక్ష్మి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, పురపాలక, ఎయిడెడ్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తూ 10 సంవత్సరాల అనుభవం కలిగిన టీచర్లు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను జిల్లాలోని డీవైఈవో, ఎంఈవో కార్యాలయాలకు పంపినట్లు తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను డీవైఈవో కార్యాలయంలో ఈనెల 8వ తేదీ లోపు అందజేయాలన్నారు. డీవైఈవో కార్యాలయంలో పరిశీలించి 12వ తేదీన డీఈవో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. ఆలస్యంగా వచ్చే దరఖాస్తులను స్వీకరించబోమని ఆమె స్పష్టం చేశారు.

అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

వెదురుకుప్పం: అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. ఆయన శుక్రవారం వెదురుకుప్పం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. నేరాల నియంత్రణ, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. నేర ప్రవృత్తికి సంబంధించిన విషయాలపై అప్రమత్తంగా మెలిగి వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్ కేసుల్లో దర్యాప్తులను ముమ్మరం చేసి వెంటనే అరెస్టులు చేయాలన్నారు. కీలక హత్య కేసుల్లో దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి చార్జిషీట్లను కోర్టులకు సమర్పించాలని చెప్పారు. చివరిగా సిబ్బంది సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఉన్నారు.

రహదారి నిర్మాణాలను వేగవంతం చేయాలి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

పలమనేరు: జిల్లాలో రహదారి నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ మేరకు పలమనేరు నియోజకవర్గంలో జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎండీఆర్, ఎస్‌హెచ్, నాబార్డ్ నిధుల ద్వారా మంజూరైన అభివృద్ధి పనులకు వెంటనే టెండర్ల ప్రక్రియ చేపట్టి ఆరు నెలల్లో వీటిని పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలోని మూడు అంతర్రాష్ట్ర రహదారుల నిర్మాణానికి నెలకొన్న అడ్డంకులను తొలగించాలని స్థానిక ఎమ్మెల్యే మంత్రిని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ స్కానింగ్ పార్ట్–2!

మళ్లీ తెరపైకి అక్రమ స్కానింగ్

- చిత్తూరు కలెక్టర్ పట్టుకున్న అక్రమ స్కానింగ్‌లో ఇది పార్ట్–2
- చిత్తూరులో గుట్టురట్టు కావడంతో తిరుపతిలో ముఠా మకాం
- ఓ క్లినిక్ అడ్డాగా లింగనిర్ధారణ
- తప్పుడు నిర్ధారణతో తమిళనాడుకు చెందిన గర్భిణితోపాటు కుమార్తె ఆత్మహత్య!
- భర్త ఫిర్యాదుతో కేసు నమోదు!



కాణిపాకం/తిరుపతి తుడా: మళ్లీ తెరపైకి అక్రమ స్కానింగ్ బాగోతం వెలుగులోకి వచ్చింది. గతంలో చిత్తూరు కలెక్టర్ పట్టుకున్న అక్రమ స్కానింగ్ వ్యవహారం పార్ట్–2 కథను తలపిస్తోంది. చిత్తూరులో గుట్టు రట్టు కావడంతో ఈ ముఠా తిరుపతికి మక్కాం మార్చింది. అక్కడ అక్రమ స్కానింగ్‌ను గుట్టుగా నడిపించింది. వీరిచ్చిన తప్పుడు రిపోర్టుతో ఓ గర్భిణి, గర్భిణి కుమార్తెను బలితీసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో తమిళనాడు పోలీసులు రంగంలోకి దిగారు. దీంతో ముఠాను అరెస్ట్ చేసి... భవానీ నగర్‌లోని అక్రమ స్కానింగ్, ఓ ప్రైవేటు ఆస్పత్రిని సీజ్ చేశారని రెండు జిల్లా అధికారులు వెల్లడించారు. ఇందులో చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న ఓ సిబ్బంది పాత్ర కీలకమని తెలిసింది. దీనిపై చిత్తూరు కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి, వన్‌టౌన్ పోలీసులు చర్చించినట్లు సమాచారం.

గర్భిణితో పాటు ఆడ బిడ్డను చంపేశారు!

వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సమాచారం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకి చెందిన ఓ గర్భిణికి తొలి కాన్పులో ఆడబిడ్డ జన్మించింది. రెండో సారి గర్భవతి కావడంతో ఆగర్భిణి ముఠా వలలో పడింది. నెల కిందట తిరుపతికి వచ్చింది. స్కానింగ్ చేయించుకుని కడుపులో ఉన్నది ఆడ బిడ్డగా తెలుసుకుంది. ఇంటికెళ్లి అబార్షన్ చేయించుకుంటానని పట్టుపట్టింది. కుటుంబీకులు ఇందుకు ఒప్పుకోకపోవడంతో కుమార్తెతో పాటు ఆ గర్భిణి బావిలో దూకి చనిపోయింది. దీనిపై భర్త ఇచ్చిన ఫిర్యాదుతో తమిళనాడు పోలీసులు కేసు నమోదు చేశారు. గర్భిణి మృతదేహాన్ని పోస్టుమార్టం చేయగా..క డుపులో ఉన్నది మగబిడ్డగా నిర్ధారణ అయ్యింది. దీంతో అక్రమ స్కానింగ్ సెంటర్‌పై అక్కడి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

చిత్తూరు సిబ్బందిదే కీలక పాత్ర

చిత్తూరులో పట్టుబడ్డ అక్రమస్కానింగ్ ముఠా సభ్యులే.. ఈ గర్భిణి మృతికి కూడా కారణమని తమిళనాడు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. వీళ్లను అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ ముఠాకు .గుడిపాల మండలంలో పనిచేసే ఓ అటెండర్ (డీఎంఅండ్‌హెచ్‌ఓ పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది) ముందుండి నడిపిస్తున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. ఇతనిని కూడా తమిళనాడు పోలీసులు రిమాండ్‌కు తరలించగా.. అతను మూడు రోజుల క్రితమే బయటకు వచ్చినట్లు కార్యాలయమంతా గుసగుసలు మొదలయ్యాయి. ఇతనే ముఠాకు స్కానింగ్ మిషన్లను కొనుగోలు చేసి ఇచ్చినట్లు చిత్తూరు శాఖలో చర్చ సాగుతోంది. ఇతనితో పాటు జీడీనెల్లూరుకు చెందిన ఓ ఆశా వర్కర్, పాలసముద్రంకు చెందిన ఓ ఏఎన్‌ఎం పాత్ర కూడా ఉందని చిత్తూరు వైద్య ఆరోగ్యశాఖలో చర్చించుకుంటున్నారు. అయినా వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సమాచారం. ఈ మేరకు పోలీసులు చిత్తూరు కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్‌ఓతో చర్చించినట్లు తెలిసింది. ఈ మేరకు ఆశావర్కర్‌పై రెండు రోజుల్లో చర్యలు ఉంటాయని చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. కాగా తిరుపతి భవానీ నగర్‌లో నడిపిస్తున్న స్కానింగ్ సెంటర్‌ను తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సీజ్ చేశారు. దీంతో పాటు ఒక మెటర్నిటీ ఆస్పత్రిని కూడా సీజ్ చేశామని తిరుపతి డీఎంఅండ్‌హెచ్‌ఓ తెలిపారు.

అక్రమ స్కానింగ్ ఇలా..

మూడు నెలలకు క్రితం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చిత్తూరు నగరంలోని భరత్‌నగర్‌లో అక్రమ స్కానింగ్ సెంటర్ నిర్వహణ ముఠాను.. రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. 22 మందిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. తాజాగా దీని పార్ట్–2 కథ బయటకు వచ్చింది. చిత్తూరులో పట్టుబడ్డ ముఠానే మళ్లీ తిరుపతి భవానీ నగర్‌లో అక్రమ స్కానింగ్‌ను ఏర్పాటు చేసుకుని లింగనిర్ధారణను కొనసాగిస్తూ వచ్చింది. దీనిపై చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేసే కొందరు ఉద్యోగులు తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు అక్రమ స్కానింగ్ సెంటర్‌పై వారు నిఘా పెట్టారు. తమిళనాడు నుంచి గర్భిణులను తీసుకొచ్చి తిరుపతిలో లింగనిర్ధారణ చేయిస్తూ జేబులు నింపుకుంటున్నారని గుర్తించారు. ఒక్కొక్కరి దగ్గరి నుంచి ఫీజుగా రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు గుంజుకుంటున్నారని తెలుసుకున్నారు. వీళ్ల నిర్ధారణలో ఓ గర్భిణికి ఇచ్చిన రిపోర్టు తప్పు అని తేలడంతో వీళ్ల బండారం మొత్తం బయటపడింది.

చేతులు మారిన స్కానింగ్ మిషన్!

కాణిపాకం: చిత్తూరులోని భరత్‌నగర్‌లో మూడు నెలలక క్రితం అక్రమ స్కానింగ్ సెంటర్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ సీజ్ చేశారు. ఇక్కడ దొరికిన స్కానింగ్ మిషన్‌ను విచారణ అనంతరంకలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు అప్పగించారు. ఈ మిషన్ కంపెనీ ఆధారంగా తమిళనాడు నుంచి బయటకు వచ్చినట్లు తెలుసుకున్నారు. ముఠా సభ్యులు స్కానింగ్ మిషన్‌ను ఎవరి దగ్గర నుంచి కొనుగోలు చేశారో తెలుసుకోవడానికి గట్టిగానే ప్రయత్నాలు చేశారు. ఈ ప్రయత్నంలో భాగంగా స్కానింగ్ మిషన్ 16 మంది చేతులు మారినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు.

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయం 10.30 గంటల నుంచి 12 గంటల వరకు సంప్రదాయ రీతిలో అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసపు రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, రంగురంగు పూలతో ముస్తాబుచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాస దీక్షలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఉభయదారులకు పవిత్ర తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఉచిత అన్నప్రసాదాలు అందజేశారు.



ప్రత్యేక పూజలందుకుంటున్న అమ్మవారు



భక్తులతో కిటకిటలాడుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం

క్లుప్తంగా

అది సరికాదు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్లను ఎంఈవోలుగా నియమించడం సరికాదని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు పీఆర్‌టీయూ, ఆపస్ సంఘాల నాయకులు శుక్రవారం డీఈవో కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను కేవలం ప్రభుత్వ యాజమాన్యంలోని స్కూల్ అసిస్టెంట్లకు అప్పగించడం దారుణమన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్ల ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు అనుగుణంగా ఎంఈవో పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు స్వామి కణ్ణన్ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు ప్రయత్నిస్తున్న తరుణంలో విఘాతం కలిగించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కరరెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, నాయకులు పురుషోత్తం, దేవేంద్ర, లవకుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నమ్మించి..వంచించి

– వితంతువును గర్భవతిని చేసి పరారైన తాపీ మేస్త్రి

శ్రీరంగరాజపురం : ఓ యువకుడు వితంతువును నమ్మించి..వంచించాడు. గర్భవతిని చేసి పరారయ్యాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ మేరకు బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె కథనం.. శ్రీరంగరాజపురం మండలం, మెదవాడ ఎస్టీ కాలనీకి చెందిన ఓ మహిళకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. అనారోగ్య కారణాల చేత భర్త మరణించాడు. దీంతో ఆమె గంగాధరనెల్లూరు మండలం, నాసింపల్లిలోని అమ్మమ్మ గారి ఇంట్లో తలదాచుకుంటోంది. అదే గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ బాలకృష్ణారెడ్డితో ఆమెకు పరిచయం ఏర్పాడింది. అతను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఆపై ఇద్దరూ సహజీవనం చేస్తూ వస్తున్నారు. పెళ్లి చేసుకోవడానికి డబ్బులు కావాలని చెప్పడంతో బాలకృష్ణారెడ్డికి సదరు మహిళ రూ.85 వేలు వడ్డీకి తీసిచ్చింది. ఆ డబ్బులు తీసుకుని బాలకృష్ణారెడ్డి పరారయ్యాడు. ఈ విషయంపై గంగాధరనెల్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. మీరైనా న్యాయం చేయాలని పోలీసులను అభ్యర్థించింది.

శ్రీవారి హుండీలో చోరీ చేసిన వ్యక్తికి జైలు

తిరుపతి లీగల్: తిరుమల శ్రీవారి ప్రధాన హుండీలో సొమ్మును అపహరించిన కేసులో చంద్రగిరి జోగుల కాలనీకి చెందిన నరేష్ అలియాస్ మహేష్‌కు నెలరోజుల జైలు శిక్ష, వంద రూపాయల జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.... 2022 నవంబర్ 16వ తేదీ సాయంత్రం శ్రీవారి ప్రధాన హుండీలో 9600 రూపాయలను నిందితుడు నరేష్ అపహరిస్తున్న దృశ్యాలను సీసీ ఫుటేజ్ ద్వారా సిబ్బంది గుర్తించారు. విజిలెన్స్ సిబ్బంది నిందితుడు నరేష్‌ను అదుపులోకి తీసుకొని తిరుమల వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు నరేష్‌కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని పూజలు



రొంపిచెర్ల మండలం శివాలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రొంపిచెర్ల: మద్యం కేసులో అరెస్టు అయిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని కోరుతూ ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మోటుమల్లెల శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబం రాజకీయ ఎదుగుదల చూడలేక చంద్రబాబు అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. మిథున్‌రెడ్డి ఎలాంటి వాడో ప్రజలకు తెలుసన్నారు. మద్యం కేసులో కడిగిన ముత్యంలా బయటకు వస్తాడని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక వైఎస్సార్ సీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతోందని దుయ్యబట్టారు. కూటమి పాలనపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో కరీముల్లా, విజయశేఖర్, శ్రీనాథనాయుడు, పెద్దిరెడ్డి దేవేంద్ర రెడ్డి, మునికృష్ణారెడ్డి, గురు, మహబూబ్‌బాషా, బావాజీ, రవీంద్ర, నీరజాక్షుల నాయుడు, ఐడియా కాలేషా, రాజాసాహెబ్, వెంకటరత్నం, బాబు, ఖలీల్, నరేంద్ర, సహదేవ రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, కరుణాకర్, శ్రీకాంత్, రియాజ్, రవీంద్రనాథరెడ్డి, కుమార్ నాయుడు పాల్గొన్నారు.



పులిచెర్ల(కల్లూరు) కొబ్బరికాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసించడంతోపాటు ఆయనకు బెయిల్ రావాలని కోరుతూ జిల్లా ప్రింటింగ్ ప్రెస్ మాజీ చైర్మన్ గోటూరి మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం పులిచెర్ల సమీపంలోని ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం బయట వెయ్యి కొబ్బరి కాయలు కొట్టారు. వారు మాట్లాడుతూ ఏ తప్పు చేయని మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం అన్యాయమని, త్వరలో బెయిల్‌పై కడిగిన ముత్యంలా బయటకు వస్తారని తెలిపారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా, రెడ్డీశ్వరరెడ్డి, ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, మువ్వల నరసింహులు శెట్టి, రాయల్ మోహన్, రెడ్డి అహమ్మద్, మునీర్‌ఖాన్, ప్రతాప్‌రెడ్డి, జాఫర్‌హుస్సేన్, ఆనంద, ఎస్వీ రమణ, మునస్వామి, గంగయ్య, రాజమూర్తి, కిష్ణమూర్తి, జేడీ నారాయణ, మునిరత్నం, నాగరాజ, మధు, శ్యామ్‌రెడ్డి, శివారెడ్డి, నటరాజ, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మీడియాను అరికట్టేందుకే స్టిక్కర్ల పంపిణీ



వాహనానికి పోలీస్ స్టిక్కర్ అంటిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్: జిల్లా వ్యాప్తంగా నకిలీ మీడియాను అరికట్టేందుకు ప్రస్తుతం వర్కింగ్ జర్నలిస్టులందరికీ స్టిక్కర్లను పంపిణీ చేశామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఆయన శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు స్టిక్కర్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసే వాళ్లు కూడా మీడియా ప్రతినిధులుగా చెలామణి అవుతున్నారని తెలిపారు. అంతేకాకుండా చాలామంది వాహనాలపై ప్రెస్, పోలీస్ స్టిక్కర్లు అంటించుకుని తిరుగుతున్నారని తెలిపారు. దీనిపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి కొన్ని వందల వాహనాలకు స్టిక్కర్లు తొలగించామన్నారు. నిజాయితీగా వర్కింగ్ జర్నలిస్ట్‌గా ఉన్న వారందరికీ గుర్తింపు ఇచ్చేందుకు పోలీస్ విభాగం తరపున ద్విచక్ర వాహనాలు, కార్లకు స్టిక్కర్లను పంపిణీ చేశామన్నారు. ఈ స్టిక్కర్ తగిలించుకున్న మీడియా ప్రతినిధులు ఎలాంటి ప్రోగ్రాములకైనా పోలీసుల ద్వారా ఇబ్బంది లేకుండా అనుమతి ఇస్తామన్నారు. అంతేకాకుండా ఈ స్టిక్కర్ స్కాన్ చేస్తే ఆ మీడియా ప్రతినిధి వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. రాత్రి సమయంలో ఎడిషన్‌లో పని చేసే పాత్రికేయుల వాహనాలకు వున్న ఈ స్టిక్కర్లను చూసి పోలీసులు అనుమతి ఇస్తారని వెల్లడించారు. ఈ స్టిక్కర్లను కాపీ చేయకుండా పకడ్బందీగా తయారు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ మురళి, సెక్రటరీ బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లోని 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 66,149 మంది స్వామిని దర్శించుకున్నారు. 24,429 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.66 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 12 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళ్లిన వారిని లోనికి అనుమతించేది లేదని స్పష్టం చేసింది.

ఆయుష్ సేవలు మరింత బలోపేతం

– తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి



పార్లమెంటులో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : జిల్లాలో ఆయుష్ సేవలను మరింత బలోపేతం చేయాలని ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్లమెంటులో ఆయుష్ వ్యవస్థల అభివృద్ధి, ఆర్థిక సహాయం, ప్రోత్సాహకాలపై వివరాలు తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ కోరారు. ప్రజారోగ్యం రాష్ట్రాల పరిధిలోకి వస్తుందని, ఆయుష్ రంగంలో అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సిన అవసరం ఉంటుందని కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావు జాదవ్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల తీసుకునే చర్యలకు అన్ని విధాలుగా సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా గత ఐదేళ్లలో రూ.28.82 కోట్ల మేర కేంద్రం నిధులు విడుదల చేసినట్లు మంత్రి తెలిపినట్లు వివరించారు. ఈ నిధులతో కాకినాడ, విశాఖపట్నంలో 50 పడకల సమీకృత ఆయుష్ ఆస్పత్రుల ఏర్పాటు చేయాలని, మరో నాలుగు ఆయుష్ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం మద్దతు ఇచ్చిందని చెప్పారు. తిరుపతి ఆయుష్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఎంపీ గురుమూర్తి కోరారు.

చెక్ బౌన్స్ కేసుల్లో నిందితులకు జైలు

తిరుపతి లీగల్ : రెండు వేరువేరు చెక్ బౌన్స్ కేసుల్లో ఇద్దరు నిందితులకు ఆరు నెలలు చొప్పున జైలు శిక్ష, ఐదువేల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ తీర్పు చెప్పారు. చంద్రగిరి మండలం, కల్ రోడ్డు పల్లికు చెందిన దొండపాటి మధుమతి తన అవసరాల కోసం తిరుపతి, రైల్వే కాలనీకి చెందిన మాచర్ల వెంకటరామయ్య వద్ద 2016 నవంబర్ 19వ తేదీ రూ.4,50,000 అప్పుగా తీసుకుని ప్రోనోటు రాసి ఇచ్చాడు. అసలు, వడ్డీ చెల్లించే క్రమంలో ఆమె 2018 నవంబర్ 19వ తేదీ 6,60,000 చెక్కును అతడికి ఇచ్చారు. ఆ చెక్కు బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో కోర్టులో మధుమతిపై చెక్కు బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పరిశీలించిన న్యాయమూర్తి ఆమెకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అదేవిధంగా మరో కేసులో రేణిగుంట, టెలిఫోన్ క్వార్టర్స్ కు చెందిన ప్రస్తుతం తిరుపతి ,దాసరి మఠం వీధిలో నివసిస్తున్న ఆరంభాకం చంద్రశేఖర్ కు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. గణేష్ రెడ్డికి ఇచ్చిన చెక్కు బౌన్స్ అయింది. దీంతో గణేష్ రెడ్డి నిందితుడు చంద్రశేఖర్ పై చెక్కు బౌన్స్ కేసు దాఖలు చేశాడు.

దరఖాస్తు చేసుకోండి

తిరుపతి సిటీ : ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5వ తేదీన జరగనున్న స్పాట్ అడ్మిషన్లకు ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో పలు కోర్సులకు సంబంధించి 35 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పలు పాఠశాలల్లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, చిల్లకూరు, డక్కిలి, కోట, నాయుడుపేట, పుదూరు, సూళ్లూరుపేట, వాకాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వాకాడు పాఠశాలలో ఐదో తరగతిలో ఉన్న పరిమిత ఖాళీలకు, నాయుడుపేటలోని తొమ్మిదో తరగతిలో ఉన్న ఖాళీలకు, నాయుడుపేట, చిల్లకూరులోని పాఠశాలల్లో బైపీసీ, ఎంపీసీ, వాకాడులో సీఈసీ, ఎంఈసీ ఖాళీలకు, పుత్తూరులోని సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సుల్లో ఉన్న ఖాళీలకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు జిల్లా అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించి, ఈ నెల 11లోపు నేరుగా ప్రవేశాలు పొందాలని తెలియజేశారు.

ఒకే చోట పింఛన్ల పంపిణీ



ఒకే చోట పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి

తిరుపతి అర్బన్: తిరుపతిలో పింఛనుదారులందరికీ ఒకేచోటకు పిలిపించి పింఛన్లు పంపిణీ చేయడంతో వాగ్వాదానికి దారితీసింది. జిల్లాలో సచివాలయ ఉద్యోగులు ఇటీవల బదిలీలు చేపట్టిన సంగతి తెలిసిందే. బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులు మొదటిసారిగా పింఛన్లు పంపిణీ చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం పింఛనుదారులను ఒక్కచోటకే పిలిపించి వారికి పింఛన్లు అందించడం మొదలుపెట్టారు. దీంతో తిరుపతిలోని 44వ డివిజన్‌లో పింఛనుదారులు ఉద్యోగులతో వాదనకు దిగారు. సామాజిక భద్రతా పింఛన్లు తొలి రోజు శుక్రవారం 95.10 శాతం మందికి పంపిణీ చేయడంతో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ప్రథమ స్థానం అనంతపురం జిల్లాకు దక్కంది. తొలి రోజు పింఛన్లు పొందని వారు శనివారం మధ్యాహ్నం వారి పరిధిలోని సచివాలయంలో పింఛన్లు తీసుకోవాల్సి ఉందని డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR
Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA Regular/lateral entry.9381287629

VOCATIONAL COURSES
తిరుపతిలోని Dr. VBR ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 10th పాస్ అయిన వాళ్ళకి ఒకేషనల్ కోర్సులు ANM/MPHW-F (నర్సింగ్)/MLT/వెటర్నరీ/డైరీ సైన్స్/అగ్రికల్చర్ సీట్లు Inter BiPC తో కలవు & ఇంటర్ పాస్ అయిన వాళ్ళకి B.Sc (నర్సింగ్), BPT, B.Sc MLT, GNM డిప్లొమా పారా మెడికల్ కోర్సులు కూడా కలవు. ✆ 81250 40004.

Real Estate

FLATS FOR SALE
తిరుపతి, అవిలాల ధనలక్ష్మి నగర్‌లో కలశం బిల్డింగ్ దగ్గర Sai Udayagiri అపార్ట్‌మెంట్‌లో 1998 Sqft East Facing 3BHK Flats అమ్మబడును.Ready to Occupy. 9493859332.

రేణిగుంట, కరకంబాడి విలేజ్ అమరరాజా ఫ్యాక్టరీ దగ్గరలో గల తారక రామానగర్‌లో ప్లాట్ నెం.159,24 అం.లలో కట్టిన రేకుల ఇంటితో సహా అమ్మబడును. 96420 71837,79891 93964.

PLOTS FOR SALE
నేషనల్ హైవే IIT దగ్గర అంతరిక్ష పరిశోధన కేంద్ర అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ ప్రక్కన పామ్ ల్యాండ్ 52 ఎకరాలలో ఎర్రచందనం చెట్లతో ఫైనల్ అప్రూవ్డ్ ప్లాట్లు ✆ 9502774175, 7995992114

TOLET
తిరుపతి కలెక్టర్ కార్యాలయం దగ్గర 2 అంతస్తులు అపార్ట్‌మెంట్ హోంస్టే కు బాడుగకు ఇవ్వబడును. 1 BHK-2, 2BHK-2, 3BHK-2, సంప్రదించండి సెల్: 90109 42318, 89185 19778.

BUSINESS SERVICE

BUSINESS OFFER
We are Ready to Invest to Develop Your Business. We also Welcome Agent., Good Commission for Agents. Call 90926 92403

TOURS & TRAVELS
రామేశ్వరం, 5 పంచభూత శివలింగాలు, 6 సుబ్రమణ్యస్వామి క్షేత్రాలు. తేది 8-8-25. 5 రోజులు, టిక్కెట్ 8500 (Aబస్సు+భోజనం+రూం) కె.వాసు, నెల్లూరు. 8491340504

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ. 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

Wanted
తిరుపతి, హోటల్ లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, 12 గంటలు, 13,000. 8 గంటలు 11,000, రూం+భోజనం ఫ్రీ, A.20–40 సం.లు. ✆ 99082 81928.

Work from home మా కంపెనీ అడ్వర్టైజ్మెంట్లు మీ మొబైల్ ద్వారా పార్ట్ టైం పంపుటకు స్త్రీ/పు. కావలెను. వారానికి 3,500. వివరాలకు వాట్సాప్‌లో hi అని మెసేజ్ పెట్టి కాల్ చేయండి 82478 08801

స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ. 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959031122, 9676901122

అనురాగ్ మానవ సేవా సంస్థ, వృద్ధుల ఆశ్రమం, బోలిచౌకి, హైదరాబాద్ 500008, Ph : 9391008292 లో చేరుటకు వృద్ధులు మరియు పనిచేయుటకు నర్సులు, ఆయాలు, స్త్రీలు కావలెను.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశదంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

డీఐసీ ఆశయానికి తూట్లు



ఆర్‌బీఎస్‌కే వాహనంలో మందులు, మాత్రలు ఇతరత్రాలను తరలిస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పుట్టుకతోనే వివిధ అనారోగ్య సమస్యల బారిన పడిన పిల్లలను డీఐసీ కేంద్రానికి తరలించేందుకు ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఓ వాహనాన్ని కేటాయించింది. అయితే ఆ వాహన ఆశయానికి డీఐసీ కేంద్ర నిర్వాహకులు తూట్లు పొడుస్తున్నారు. పిల్లలను తీసుకొచ్చేందుకు బదులుగా..మందులు, మాత్రలు సరఫరాకు వాడుకుంటున్నారు. కలెక్టరేట్‌లోని మందులు, మాత్రల గోడౌన్ వయా డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం, డీఐసీకి మందులు, మాత్రలు సరఫరా చేసుకుంటున్నారు. ఇలా సరఫరా చేస్తూ... ఆ వాహనం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం వద్ద సాక్షి కంట పడింది. ఇదేమని కేంద్ర నిర్వాహకులను ప్రశ్నిస్తే...షరా మామూళ్లే అని కొట్టిపడేశారు. కాగా ఈ వాహనం కార్యాలయానికి వచ్చేంత వరకు ప్రత్యేక ప్రతిభావంతుడైన ఓ బాలుడు కార్యాలయంలోనే గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది.

కుప్పంలో ఘోర రోడ్డు ప్రమాదం



మృతి చెందిన గౌతమ్

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ
- యువకుడి మృతి
- మరొకరి పరిస్థితి విషమం

కుప్పం: పట్టణంలోని బైపాసు రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మితిమీరిన వేగంతో వెళ్తున్న లారీ దిచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. పక్కనే పార్కింగ్ చేసి ఉన్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు గౌతమ్ (22) అక్కడికక్కడే మృతి చెందగా.. అహ్మద్ కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. పోలీసు కథనం.. గుడిపల్లి మండలం, తంజంకొట్టం గ్రామానికి చెందిన గౌతమ్, అహ్మద్ కుప్పం బస్టాండు నుంచి ఫ్లైఓవర్ మీదుగా కృష్ణగిరి వైపు వెళ్లేందుకు బుల్లెట్ ద్విచక్ర వాహనంతో వచ్చాడు. ఫ్లైఓవర్ వద్ద మలుపు నుంచి తిరుగుతుండగా క్రిష్ణగిరి వైపు నుంచి అతి వేగంతో వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొని.. రోడ్డు పక్కనే ఆగి ఉన్న మరో పాల లారీని ఢీకొంది. దీంతో రెండు లారీల మధ్య ద్విచక్ర వాహనదారుడు నలిగిపోయాడు. ఈ ప్రమాదంలో గౌతమ్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన అహ్మద్‌ను చికిత్స నిమిత్తం పీఈఎస్ మెడికల్ కళాశాలకు తరలించారు. అహ్మద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సేలం నుంచి కోళ్ల ఫారాలకు ఫీడ్ తీసుకుని పలమనేరు వెళ్తున్న లారీ మితిమీరిన వేగంతో పాటు ఫ్లైఓవర్ పై నుంచి కిందికి వస్తూ రెండు వాహనాలను ఢీకొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ





కూల్‌డ్రింక్స్ పైకప్పును తొలగించిన దృశ్యం, ఎంటర్ ప్రైజెస్‌లోని సీసీ కెమెరాలో దుండగుడి చిత్రం

పుత్తూరు: డీఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే రెండు దుకాణాల్లో గురువారం రాత్రి చోరీ చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని శ్రీమారుతీ ఎంటర్‌ప్రైజెస్ దుకాణం పైకప్పులోని రేకును కత్తిరించి దుండగుడు లోనికి ప్రవేశించాడు. దుకాణం లోపల అమర్చిన సీసీ కెమెరాను ఆఫ్ చేసి అనంతరం గల్లాలోని రూ.25 వేల నగదును దోచుకెళ్లాడు. సమీపంలోనే ఉన్న ఇలియాస్ కూల్‌డ్రింక్స్ షాపు పైభాగం నుంచి లోనికి ప్రవేశించిన దుండగుడు గల్లాలోని రూ.5 వేలు అపహరించాడు. రెండు దుకాణాల్లోనూ ఒకే వ్యక్తి చోరీకి పాల్పడినట్లు భావిస్తున్నారు. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా దుండగుడు మాస్క్ వేసుకొని లోపలికి ప్రవేశించినట్లు తెలుస్తోంది. సదరు దుండగుడు తమ షాపులో పనిచేసి నిలిచి పోయిన వ్యక్తిగా ఎంటర్‌ప్రైజెస్ యజమాని కళ్యాణి తెలిపారు. ఈ ఏడాది జనవరిలోనూ ఇలాగే దొంగతనం జరిగిందని, అప్పుడు కూడా రూ.లక్ష దోచుకెళ్లారని ఆమె వాపోయారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మలేషియా వర్సిటీతో ఎస్పీడబ్ల్యూ కళాశాల ఒప్పందం



ఎంఓయూ చేసుకుంటున్న మలేషియా వర్సిటీ అధ్యాపకులు, ఎస్పీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్

తిరుపతి సిటీ : యూనివర్సిటీ ఆఫ్ మలేషియా తెరెంగ్గానుతో పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల మధ్య విద్యాభివృద్ధిపై ప్రతిష్టాత్మక ఒప్పందం కుదిరింది. ఈ మేరకు శుక్రవారం పద్మావతి డిగ్రీ కళాశాల బయో టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ, మలేషియా వర్సిటీ ఫిషరీస్ అండ్ ఫుడ్ సైన్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్ మన్సూర్ ఇస్మాయిల్ షేక్ ఒప్పందపు పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్య, పరిశోధన, సాంస్కృతిక అంశాలతో పాటు విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలపై పరస్పర సహకారం అందిపుచ్చుకునేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ సి భువనేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో 'అక్షరధామ్' గురువులు



ఆధ్యాత్మిక గురువులకు జ్ఞాపికను అందజేస్తున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఢిల్లీలోని ప్రముఖ అక్షరధామ్ స్వామి నారాయణ్ ఆలయానికి చెందిన ఆధ్యాత్మిక గురువులు అక్షర్ ప్రేమ్, వినమ్రవదన్ శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. వీరికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వారికి వివరించారు. పర్యటనలో భాగంగా పారిశ్రామికవాడ పరిసరాలతో పాటు స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని, అక్కడ ఏర్పాటు చేసిన శ్రీసిటీ ఉద్యానవనాన్ని స్వామీజీలు సందర్శించారు. అక్కడ నుంచి డైకిన్ ఏసీ పరిశ్రమకు వెళ్లి సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. పచ్చదనం, పర్యావరణం, ఆధ్యాత్మికతకు పెద్దపేట వేస్తూ ముందుకు సాగుతున్న శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని ప్రశంసించిన స్వామీజీలు, శ్రీసిటీ ఎండీని అభినందిస్తూ ఆశీర్వచనాలు అందజేశారు. దక్షిణ భారతదేశంలో శ్రీ సిటీ కేంద్రంగా స్వామి నారాయణ్ ఆలయ నిర్మాణాన్ని చేపట్టాలని ఈ సందర్భంగా వారికి ఎండీ విజ్ఞప్తి చేశారు.

ఇంటింటికీ మంగళం



జీడి నెల్లూరులో పెన్షన్ల కోసం పడిగాపులు కాస్తూ...

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పింఛన్ల పంపిణీ మళ్లీ మొదటికొచ్చింది. ఐదేళ్ల క్రితం టీడీపీ పాలనలో వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ల కోసం పడ్డ కష్టాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఎన్నికల ముందు వలంటీర్లు లేకపోయినా ఇంటి వద్దకే పింఛన్లు ఇస్తామన్న కూటమి పెద్దలు సోమవారం సచివాలయాలు, నడివీధుల్లో గంటలు తరబడి నిల్చోబెట్టి పంపిణీ చేశారు. ఈ పరిస్థితిని చూసి లబ్ధిదారులు ఇందుకేనా మేము ఓట్లేసింది' అంటూ నిట్టూర్చడం కనిపించింది. ఈ దృశ్యాలను శుక్రవారం తిరుపతి, జీడీ నెల్లూరు నియోజకవర్గాల్లో కనిపించిన చిత్రాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి